ప్రజాశక్తి

గురువారం 3 జులై 2025 5

పార్వతీపురం మన్యం

నేడు ప్రయివేట్ పాఠశాలల బంద్

ప్రజాశక్తి-వీరఘట్టం

జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రయివేట్ పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంబాన శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ బంద్ చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యాసంస్థలను మూసివేసి బంద్‌లో పాల్గొనాలని కోరారు.

తప్పని డోలిమోతలు

మంత్రి ఇలాకాలో గిరిజనులకు అవస్థలు

ప్రభుత్వాలెన్ని మారినా గిరిజనులకు డోలిమోతలు తప్పడం లేదు. ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మొహం చాటేయడం పాలకులకు అలవాటుగా మారింది. సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నియోజకవర్గంలోనే డోలిమోతలు కనిపిస్తున్నాయి. పాచిపెంట, సాలూరు మండలాల్లో ఉన్న గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజనులకు డోలిమోతలు తప్ప మరో మార్గం లేదు. కొండలు, గెడ్డలు దాటుకుంటూ రాళ్లు, రప్పలను తొక్కుకుంటూ కాలినడకన కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే గాని మైదాన ప్రాంతానికి చేరుకోలేని దుస్థితి నెలకొంది.

శ్యామలను డోలికట్టి కొండ దించుతున్న కుటుంబ సభ్యులు, బంధువులు

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు మండలం కరడవలస పంచాయతీ ఎగువ కాషాయవలస గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కూనేటి శ్యామల (45) వాంతులు, విరోచనాలు, జ్వరంతో బాధపడుతూ అపస్మారక స్థితికి చేరింది. పరిస్థితి విషమంగా మారుతుందనే భయంతో ఆమెను బంధువులు డోలిలో ఐదు కిలోమీటర్ల దూరం నడిచి కురుకుట్టి గ్రామానికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి వెంటనే సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్య సేవలు అందడంతో ఆమె ఆరోగ్యం కుదుట పడింది. ఎగువ కాషాయ వలస నుంచి డోలీ కట్టి ఆశా కార్యకర్త శ్యామలని కుటుంబ సభ్యులు కొండలు, గుట్టలు, సువర్ణముఖి నది దాటుకొని కురుకుట్టికి చేర్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డోలీలు మోత లేకుండా చేస్తామని ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రకటనలు చేశారని తెలిపారు. అవి ప్రకటనలకే పరిమితమయ్యాయని చెప్పారు. గిరిజన ప్రాంతంలో కనీసం రోడ్లు, మౌలిక సదుపాయాలు లేవన్నారు. కురుకుట్టి ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు : కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పిఎం జన్‌మన్, ఇతర గృహ నిర్మాణాలు, పిఎం సూర్యఘర్ పనులు మరింత వేగవంతం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వారంలోగా ప్రగతి కనబరచకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిఎం సూర్యఘర్, గృహ నిర్మాణాలపై జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని జిల్లాలో మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులందరూ సమన్వయంతో ప్రతి వారం లక్ష్యాలను నిర్దేశించుకొని యూనిట్లను స్థాపించాలన్నారు. జూలై 2 నాటికి 300కి పైగా సూర్యఘర్ యూనిట్లు స్థాపితం కావాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. యూనిట్ల స్థాపనలో సమస్యలు తలెత్తకుండా అధికారులు చొరవ తీసుకోవాలని స్పష్టంచేశారు. జిల్లాలో సూర్యఘర్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుందని, ప్రభుత్వం కూడా సబ్సిడిని అందజేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని ఇంటి యజమానులకు అవగాహన కల్పించి, వీలైనన్ని యూనిట్లు ఏర్పాటయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వచ్చే వారానికి ప్రగతిని కనబరచాలని, ప్రతి రోజూ సాధించిన యూనిట్ల వివరాలను తమకు అందజేయాలని సూచించారు. అయినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

అనంతరం పిఎం జన్‌మన్ గృహాలు, ఇతర గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షించారు. పిఎం జన్‌మన్ కింద అదనపు నిధులను కూడా లబ్ధిదారులకు మంజూరు చేశామన్నారు. అయినప్పటికీ గృహ నిర్మాణాల్లో ప్రగతి కనబరచకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తుందని అసహనం వ్యక్తంచేశారు. ఇకపై నిర్మాణాల్లో జాప్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లను, మండల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారానికి గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాలని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎం.సుధా రాణి, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, ఎల్‌డిఎం ఎన్.విజయ్ స్వరూప్, ఇతర అధికారులు, మండల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

10న మెగా పిటిఎం 2.0

అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలి : డిఐఇఒ

ప్రజాశక్తి-పార్వతీపురం

మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ 2.0 (పిటిఎం)ను ఈ నెల పదో తేదిన నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వై.నాగేశ్వరరావు తెలిపారు. వాస్తవంగా ఈ నెల 5న జరగాల్సిన మెగా పిటిఎం కార్యక్రమం పదో తేదికి మారుస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ సమాయత్తం కావాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమ నిర్వహణపై నిర్దేశించిన మార్గదర్శకాలను, సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్‌కు తెలియజేసినట్లు చెప్పారు. కళాశాల సిబ్బందితో కలిసి సమన్వయం చేసుకుని, నిశితంగా పర్యవేక్షించాలని ప్రిన్సిపల్స్ కు సూచించారు.

మార్గదర్శకాలలో ముఖ్యాంశాలు

ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి, రాష్ట్ర వ్యాప్తంగా సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి మెగా పిటిఎం 2.0 కార్యక్రమం చేపడుతున్న విషయాన్ని గమనించాలని డిఐఇఒ కోరారు. పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ విద్యలో సమాజ భాగస్వామ్యంతో ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009, జాతీయ విద్యా విధానం-2020, విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం, ముఖ్యంగా తల్లిదండ్రుల పాత్ర కీలకమని తెలిపారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాలలు మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి పిటిఎం కీలక వేదికగా పనిచేస్తుందని చెప్పారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఒకే రోజు మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లను వేడుకగా నిర్వహించాలని సంకల్పించిందని వివరించారు. ప్రిన్సిపల్స్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సమావేశంలో కళాశాల విద్యాపరమైన పనితీరు, మౌలిక సదుపాయాల లోపాలు, కార్యాచరణ ప్రణాళికలను తెలియజేస్తారని వివరించారు. సరదా కార్యకలాపాలు, ఆటల ద్వారా కార్యక్రమంలో పాల్గొన్న అందరి తల్లిదండ్రుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం పెంపొందించవచ్చని తెలిపారు. విద్యార్థుల, పాఠశాలల విజయ గాథలను ప్రశంసించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుటుంబ ఫొటోబూత్ లు, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్క నాటడంలో భాగంగా గ్రీన్‌పాస్‌పోర్ట్ ఉన్నాయని వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు మొక్కలు సరఫరా చేయడానికి నమోదు చేసుకోవడానికి 'లీప్ యాప్' అందుబాటులో ఉందని తెలిపారు. మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-పార్వతీపురం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పాచిపెంట నుంచి సాలూరు వరకు కాలువల మరమ్మతులు పూర్తి చేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమ వుతుందని, మరో కొద్ది రోజుల్లో నీరు విడుదల చేపడతామని అధికారులు ప్రకటిస్తుండడం విడ్డూరమని మండిపడ్డారు. కాలువల పనులు పూర్తి చేయకుండా నీరు విడుదల చేస్తే పొలాలకు నీరందే పరిస్థితి లేదని చెప్పారు. అటువంటి ప్రణాళికను పూర్తి చేయకుండా నీటి విడుదలకు అధికారులు సిద్ధం కావడం రైతులకు నట్టేట ముంచడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు, తోటపల్లి ఎడమ కాలువ, పెదంకలాం, గుమ్మిడిగెడ్డ ప్రాజెక్టులతో పాటు ఇతర చెక్‌డ్యాముల పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడం వల్ల పిచ్చి మొక్కలతో, చెత్తతో కాలువలు మొత్తం పూరుకుపోయాయని తెలిపారు. దీని వల్ల ఉపాధి పనులు కూడా నిలిచిపోయాయని చెప్పారు. మరోవైపు బకాయి బిల్లులు విడుదల కాక కూలీలందరూ పస్తున్న పడే పరిస్థితి ఉందని వివరించారు. వెంటనే జిల్లా మంత్రి, కలెక్టర్ చిత్తశుద్ధితో స్పందించి కనీసం ఈ ఖరీఫ్ సీజన్‌కైనా రైతుల పొలాలకు నీరందించే విధంగా కాలువల మరమ్మతు పనులు పూర్తి చేయాలని, ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, ఎన్.వై.నాయుడు, కె.రామస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

గురుకుల, ఏకలవ్య పాఠశాలను సందర్శించిన ఐటిడిఎ పిఒ అశుతోష్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

విద్యార్థులు లక్ష్యంతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి వెళ్ళడానికి వీలుంటుందని పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. గుమ్మ లక్ష్మీపురం మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. ఏకలవ్య పాఠశాల, భద్రగిరి గిరిజన గురుకుల బాలుర కళాశాలను సందర్శించారు. ఏకలవ్య పాఠశాలలో సంబంధిత సిబ్బందితో మాట్లాడి, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేశారు. క్రీడా మైదానం అభివృద్ధి చేసి, విద్యార్థులతో అన్ని రకాల ఆటలు ఆడించాలని సూచించారు. తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాల బోధన పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. చదువులు ఏ మేరకు పట్టు సాధించారనే దానిపై పలు ప్రశ్నలు వేశారు. బాగా చదివి ఉద్యోగాల్లో రాణించాలని కోరారు. వంటశాల, కళాశాల భవనం పరిశీలించారు. భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, కొత్త భవనం మంజూరు చేయాలని ప్రిన్సిపల్ యుగంధర్.. పిఒను కోరారు.

అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ శేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్, ఐటిడిఎ ఎఇ అప్పారావు, ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి -కురుపాం

కురుపాంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం కురుపాంలోని గాంధీనగర్ వీధిలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి తొలి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను, సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును తెలుసుకున్నారుక. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి, సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూదేవి

సీతంపేట : మండలంలో గోయిది పంచాయతీలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గ పరిశీలకులు శివ్వాల సూర్యనారాయణ, ఎన్నికల పరిశీలకులు సనపల ఢిల్లీశ్వరరావుతో కలిసి ఇంటింటికి వెళ్లి ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోలక రసూల్, కొండగొర్రి శ్రీనివాసరావు, విశ్వనాథం, ఎఎంసి డైరెక్టర్ మూర మోహన్, కొత్తకోట వేనమ్మ, సవర మంగయ్య, మాజీ జెడ్‌పిటిసి రాజబాబు, మాజీ ఎంపిటిసి జయలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంటలమ్మలను విధుల్లో చేర్చుకోవాలి

ప్రజాశక్తి-బలిజిపేట

హైకోర్టు, కలెక్టర్ ఆదేశాల ప్రకారం అరసాడ హైస్కూల్లో తొలగించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులను, నైట్ వాచ్‌మెన్‌ను విధుల్లో చేర్చుకోవాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు డిమాండ్‌చేశారు. వారిని చేర్చుకోకుండా కొత్త వారికి అకౌంట్లు తెరవాలని ఒత్తిడి చేస్తున్న డిఇఒ రాజకుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం బాధిత కుటుంబాలతో కలిసి ఆయన మాట్లాడారు. అరసాడ హైస్కూల్లో 22 ఏళ్ల నుంచి వంట చేస్తున్న గిరిజన, రజక మహిళలను కులం పేరుతో దూషిస్తూ, రాజకీయ కక్షతో అన్యాయంగా గతేడాది తొలగించారని చెప్పారు. తప్పని పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయిస్తే, వారిని విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించిందని చెప్పారు. కలెక్టర్ సైతం పాత మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కొనసాగించాలని చెప్పారని గుర్తుచేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, ఆ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న డిఇఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బాధిత ఎండిఎం కార్మికులు కొట్టిశ కళావతి, గొడబ చిన పార్వతి, గొడబ పార్వతి, అరసాడ అప్పిశెట్టి పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న అద్దె బస్సు డ్రైవర్లు, సిఐటియు నాయకులు

అద్దెబస్సు డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

డిపోలో అద్దె బస్సు డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్‌చేశారు. అద్దెబస్సు డ్రైవర్లు రెండో రోజు బుధవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అద్దెబస్సు డ్రైవర్ల సమస్యలపై కాలయాపన చేయడం సరికాదని తెలిపారు.

ఆర్‌టిసి అధికారులు, బస్సుల యజమానులు వెంటనే చర్చలకు సిద్ధం కావాలన్నారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎస్ఆర్‌టిసి హైర్ బస్సు డ్రైవర్లు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.వి.చారి, కార్యదర్శి పి.డి.ప్రసాద్, ఎ.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం జిఎస్‌టి వసూలు కావాలి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జిల్లాలో వాణిజ్య, వాణిజ్యేతర సంస్థల నుంచి నూరు శాతం జిఎస్‌టి వసూళ్లు కావాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్.. జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందుకు ఆదాయం తెచ్చిపెట్టే శాఖలైన గనులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎల్‌డిఎం, డిపిఒ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఆర్.డబ్ల్యూ.ఎస్, ఐటిడిఎలు, మున్సిపాలిటీలు, పరిశ్రమల కేంద్రం, ఎపిఐఐసి శాఖలకు చెందిన అధికారులు తమ వద్ద ఉన్న జాబితాలను వాణిజ్య పన్నుల శాఖకు అందజేయాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిఎస్‌టి వసూళ్లపై సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా వెనుకబడిన జిల్లా అయినా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన జిఎస్‌టి వసూళ్లను సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఆస్తి పన్నులో కూడా జిఎస్‌టి వసూలయ్యేలా చొరవ తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వృత్తి పన్ను వసూలు కావాలని అన్నారు. జిఎస్‌టి వసూళ్లపై డిడిఒలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. టిడిఎస్ వసూలు కాకుండా చాలా వరకు చెల్లింపులు జరిగే అవకాశం ఉందని, అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రిజిస్టర్ కాబడిన వాణిజ్య వ్యాపారాలు, నూతన భవనాలు, ఇతర సముదాయాల మేరకు పన్నుల వసూలు చేసుకునేందుకు వీలుగా జాబితాలను వాణిజ్య పన్నుల శాఖకు అందజేయాలని తెలిపారు. మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో ఆస్తి, ఇతర పన్నులు సక్రమంగా వసూలు చేసేలా గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంపిడిఒలు అందజేయాలని స్పష్టంచేశారు. జిఎస్‌టి వసూళ్లు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అందుకు కారణాలను తెలుసుకోవాలని ఆదేశించారు.

వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో జిఎస్‌టి వసూళ్లు తక్కువగా ఉన్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న పనుల వివరాలను తమకు అందజేయడం ద్వారా జిఎస్‌టి వసూలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారుల సమన్వయంతో వసూలు చేసేందుకు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎల్‌డిఎం ఎన్.విజయ్ స్వరూప్, డిపిఒ టి.కొండలరావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఒ.ప్రభాకరరావు, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణలో పురోగతి ఉండాలి

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

రక్తహీనత నివారణ ధ్యేయంగా జిల్లాలో చేపడుతున్న ఎనీమియా యాక్షన్ కమిటీల ద్వారా పురోగతి సాధించే దిశగా కార్యాచరణ చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. తాళ్లబురిడి, పెదబొండపల్లిలో నిర్వహించిన ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశాలను బుధవారం ఆయన పర్యవేక్షించారు. రక్తహీనత నివారణకు ఏ విధమైన కార్యాచరణ చేపడుతున్నారు, చేసిన కమిటీ తీర్మానం, రక్తహీనతగా గుర్తించిన గర్భిణుల, బాలింతల వివరాలు ఎఎసి రికార్డులో పరిశీలించారు. గత నెలలో రక్తహీనత నివేదికల్లో ప్రస్తుతం పురోగతిపై ఆరాతీశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు తగు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. పౌష్టికాహారం ఆవశ్యకతపై వివరించి అంగన్వాడీ కేంద్రం నుంచి అందజేస్తున్న టిహెచ్ఆర్ సద్వినియోగం చేసుకోవాలని, కిల్కారీ మొబైల్ సందేశాన్ని పాటించాలని సూచించారు. ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలన్నారు. గర్భిణీ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. డిఎంహెచ్ఒ ద్వారా గర్భినులకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిపిఎంఒ పిఎల్ రఘుకుమార్, వైద్యాధికారులు కౌశిక్, ధరణి, పంచాయతీ సెక్రటరీ సిహెచ్.లక్ష్మి, సూపర్వైజర్లు వెంకటనాయుడు, జయలక్ష్మి, రవణమ్మ, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

గిరిజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా
ఎస్‌సి, ఎస్‌టిలను నియమించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

వెలుగు గిరిజన జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా దళిత, గిరిజనులను నియమించాలని బుధవారం గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 20 సంవత్సరాలుగా గిరిజనులకు, దళితులకు గిరిజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రాధాన్యత ఇచ్చేవారని చెప్పారు. కొత్తగా మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత గత రెండు సంవత్సరాల పాటు అదే ఆనవాయితీ కొనసాగిందన్నారు. కొత్తగా వచ్చిన డిఆర్‌డిఎ పీడీ సుధారాణి ఏ అర్హతా లేని 65 సంవత్సరాలు పైబడిన వీరఘట్టం మండలం కంబర గ్రామానికి చెందిన భూస్వామి కుటుంబం నుండి వచ్చిన లలితకుమారిని అధ్యక్షులుగా నియమించారని చెప్పారు. గిరిజనుల అభిప్రాయం లేకుండా, సమాఖ్య కమిటీ సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండా డిఆర్‌డిఎ పీడీ ఏకపక్షంగా కట్టబెట్టడాన్ని పరిశీలించాలని కోరారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ సమస్య పరిష్కరించి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బలక్ష్మి, కమిటీ సభ్యులు కె.మేరమ్మ, శాంతికుమారి, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ ఉన్నారు.

గోరపాడులో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో పది రోజులుగా సంచరిస్తున్న ఏనుగులు బుధవారం గోరపాడు కొండల్లో దర్శనమిచ్చాయి. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. అరటి, పైనాపిల్ ధ్వంసం చేస్తున్నాయి. కొండపోడుకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ బీట్ అధికారి బాలినాయుడు ఎప్పటికప్పుడు ఏనుగులు కదలికలు తెలుసుకొని, గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు.

వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

ఐటిడిఎలో ఉద్యోగోన్నతుల ఉత్తర్వులు జారీ కోసం అక్రమంగా డబ్బులు వసూళ్లపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వసతిగృహ సంక్షేమ అధికారుల ఉద్యోగోన్నతుల్లో కూడా పద్ధతి అమలు కాలేదని చెప్పారు. గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు స్వల్పంగా జీతాలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేసే పాఠశాల సహాయకులకు ఇస్తున్నట్లు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికులకు రక్షణ కరువు

ప్రజాశక్తి- సీతానగరం

భవన నిర్మాణ కార్మికులకు రక్షణ కరువైందని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం సీతానగరం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల కోసం 1214 మెమోను రద్దుచేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జిల్లాలో నిర్మాణరంగం విస్తృతంగా పెరిగిందని, ప్రమాదాలు కూడా అదే మాదిరిగా పెరిగాయని చెప్పారు. అందుకు తగు రక్షణ ప్రభుత్వాలు కల్పించడం లేదన్నారు. కార్మిక శాఖ అధికారుల తనిఖీలు లేవని, ఆ శాఖ ఉత్సవ విగ్రహంలా తయారైందని చెప్పారు. నాసిరకం పనులతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని, కార్మికుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన బోర్డును నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డులో కార్మికుల పిల్లల చదువుల ఖర్చు, ప్రసూతి, ప్రమాద బీమా లాంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని, కార్మికుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన నిధిని ఇతర పథకాలకు దారిమళ్లిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈనెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి తోలాపు రమేష్, సభ్యులు ఆర్.శంకరరావు, శ్రీను పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి కొమరాడ

గిరిజన సంక్షేమ గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల వేతనాలు పెంచడంపై ప్రభుత్వానికి గిరిజన గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మంత్రి సంధ్యారాణిని కలిసి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఆయనతో పాటు ప్రధానకార్యదర్శి గురప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శామ్యూల్ ఉన్నారు.

మక్కువ తహశీల్దార్‌గా భరత్ కుమార్

ప్రజాశక్తి-మక్కువ

భరత్‌కుమార్

మండల నూతన తహశీల్దార్‌గా కింతలి భరత్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో జామి, శృంగవరపుకోట తహసీల్దార్‌గా, విజయనగరం డిప్యూటీ తహశీల్దార్ గా పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. త్వరితగతిన ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని భరత్‌కుమార్ తెలిపారు.

చినుకు పడితే చిత్తడే

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం పశు వైద్య కేంద్రానికి వెళ్లే మార్గమిది

మండలంలోని గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రం రహదారి, ఆర్ అండ్ బి బంగ్లా, గౌడ, కొండవీధిలోతోపాటు కాగితాడ, గదబవలస, కె.ఇచ్ఛాపురం, బట్టిగుడ, రామాపురం, బల్లగుడ్డి, తదితర గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, గ్రామాల రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఎలా ఎదుర్కోవాలో వివరించారు. దీనిపై అవగాహన ఉంటే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పి.అమల తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహిళా సర్పంచుల శిక్షణ

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని 16 మంది మహిళా సర్పంచులకు గత నెల 30 నుండి నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసినట్లు ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు. స్థానిక సర్పంచులకు జిల్లా కేంద్రంలో శిక్షణ నిర్వహించామని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పంచాయతీ పరిపాలనలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్నెల్లలో పనులన్నీ పూర్తికావాలి

ఇంజినీర్లను ఆదేశించిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఆర్‌అండ్ బి, పంచాయతీ రాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్, జలవనరులు, ప్రజారోగ్యం, గిరిజన సంక్షేమం, ఎపి ఎంఎస్‌ఐడిసి, ఎపిఇడబ్ల్యుఐడిసి, టిడ్కో, గృహ నిర్మాణ సంస్థల ద్వారా చేపట్టిన పనులన్నీ ఆరు మాసాల్లోగా పూర్తికావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను సిద్ధం చేసి ఎమ్మెల్యేల ఆమోదంతో ప్రతిపాదనలను తమకు సమర్పించాలన్నారు. నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో వాటిని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. అనంతరం శాఖల వారీగా చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు.

బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం జన్‌మన్ కార్యక్రమం కింద చేపట్టిన రహదారుల పనులను వేగవంతం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమమైన పిఎం జన్ మన్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇకపై ప్రతి రోజూ, ప్రతి వారం, ప్రతి మాసం సాధించిన ప్రగతి వివరాలను తమకు సమర్పించాలని, ఆగస్టు 15 నాటికి పనులు పూర్తయ్యేలా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రారంభించి కొనసాగుతున్న పల్లె పండుగ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని తేల్చిచెప్పారు. శతశాతం పనులు పూర్తయి ప్రారంభం కాని గ్రామ సచివాలయ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఇతర కట్టడాలను ఎమ్మెల్యేల ద్వారా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ నియోజక వర్గంలో అవసరమైన పనులను గుర్తించి, వాటి జాబితాలను సిద్ధం చేయాలని అన్నారు. అటువంటి వాటిని ఆయా నియోజక వర్గ శాసనసభ్యుల ఆమోదంతో ప్రతిపాదిస్తే, వాటికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎపి టిడ్కో ఆధ్వర్యంలో పూర్తయిన గృహాలను లబ్దిదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేఅవుట్లలో పూర్తయిన గృహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిపిఒ టి.కొండలరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ప్రభాకరరావు, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు పూలమొక్కను అందజేస్తున్న వీరేష్ చంద్రదేవ్

కలెక్టర్‌ని కలిసిన వీరేష్

సాగునీటి సమస్యపై విజ్ఞప్తి

ప్రజాశక్తి - కురుపాం

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ బుధవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కురుపాం నియోజకవర్గ రైతులకు సంపూర్ణంగా సాగునీరు అందాలంటే, గుమ్మిడిగెడ్డ రిజర్వాయర్ విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని వీరేష్ వివరించారు.

వేర్వేరుగా తడి, పొడి చెత్త సేకరణ

ప్రజాశక్తి-సీతానగరం

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిపిఒ కొండలరావు

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని డిపిఒ టి.కొండలరావు అన్నారు. మండలంలోని కాశీపేట గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి డంపింగ్ యార్డులో వాటిని ఆర్థిక వనరుగా మార్చాలన్నారు. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతను పాటించేలా చర్యలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి.అప్పమ్మ, మాజీ జెడ్‌పిటిసి తెంటు వెంకటప్పలనాయుడు, ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్‌ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిఎల్‌పిఒ టి.కొండలరావు అన్నారు. మండలంలోని అంటిపేటలో వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని, కాలువలో మురుగునీరు నిలువ లేకుండా చూడాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గుల్ల' చేతికే టిడిపి పగ్గాలు!

ప్రజాశక్తి-మక్కువ

టిడిపి మక్కువ మండల పగ్గాలు మళ్లీ ప్రస్తుత పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడుకు దక్కనున్నట్లు తెలుస్తోంది. మండలంలో టిడిపి గ్రూపులుగా ఉన్నప్పటికీ, లోలోన కొంతమంది సీనియర్లు ఇష్టం లేకపోయినా బయట పడలేని పరిస్థితి నెలకొంది. బిసిలకు మండల అధ్యక్ష పీఠం కట్టబెడుతున్నా, కొంతమంది సీనియర్లు పదవిని ఆశిస్తున్నారు. వీరంతా గ్రూపులుగా ఉన్నప్పటికీ మంత్రి విషయంలో అంతా అనుయాయులుగానే నడుస్తూ వస్తున్నారు. ఈసారైనా తమలో ఎవరికో ఒకరికి అధ్యక్ష పీఠం వరిస్తుందేమోనని ఆశ పడినప్పటికీ వారి ఆశ నిరాశగా మిగిలిపోనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. వేణుగోపాలనాయుడు బిసికి చెందిన వ్యక్తి కావడంతో పాటు మంత్రి ఆశీస్సులు కూడా పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కొన్ని పరిణామాల నేపథ్యంలో వేణుగోపాల నాయుడుపైనా మంత్రి ఒకింత అసహనానికి గురవుతున్నట్లు పలువురు పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఈ దశలో మంత్రి ఆశీస్సులు వారి వైపు మొగ్గు చూపుతాయేమోనని సీనియర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ అడిగితే గాని అమ్మయినా అన్నం పెట్టదన్న చందంగా వారి అభిప్రాయాలను మంత్రి వద్ద వెలిబుచ్చుకుంటే ఎలా పదవులు ఇస్తారని మరి కొంతమంది పార్టీ కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు.

సీనియర్ల గురించి ఏ ఒక్కరూ మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని మంత్రి వద్ద చెప్పలేకపోవడం కూడా వీరి వెనుకబాటు తనానికి కారణంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు పార్టీ వ్యవహారాల అన్నింటిలోనూ చురుకుగా వ్యవహరిస్తూ, పార్టీ అధినాయకత్వానికి విధేయతగా ఉండడం, బలమైన గ్రూపును కూడగట్టుకోవడమే గుల్ల వేణుగోపాల్‌కు మళ్లీ పగ్గాలు రావడానికి సానుకూల పవనాలంటూ మరోవైపు వాదనలు వినిపిస్తున్నాయి.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

వీరఘట్టం వైద్యాధికారికి సమ్మె నోటీస్ అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి ఎన్.ప్రసాదరావు డిమాండ్ చేశారు. బుధవారం ఎపి ఆశా వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యాధికారి సాయికుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌గా ఆశాలను మార్పు చేయాలని, ఒప్పంద జిఒలు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీదేవి, నీలిమ, జ్యోతి, అరుణకుమారి, తవిటమ్మ, కృష్ణవేణి, సుజాత, హైమావతి, రాజేశ్వరి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ఈ నెల 9వ తేదీన చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ ఆశా వర్కర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, మరియమ్మ పాల్గొన్నారు.

డెంగీ మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతంపేట

మానవహారం చేపడుతున్న వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది

స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద జాతీయ డెంగీ మాసోత్సవాలను డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె.విజయ పార్వతి, జిల్లా మలేరియా అధికారి పివి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. సీతంపేట ఏరియా ఆసుపత్రిని నుంచి పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు మాసోత్సవాలు జరుగుతాయని చెప్పారు. దీనిపై వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, దోనుబాయి వైద్యాధికారి భాను ప్రతాప్, ఎంఎంఒ శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి మోహన్ రావు, మలేరియా సిబ్బంది ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌కు కారణాలు కనుక్కోవాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-కొమరాడ

బాధితులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మండలంలోని గంగరేగువలస, సోమినాయుడు వలస, రాజ్యలక్ష్మిపురం, తదితర గ్రామాల్లో కేన్సర్ మహమ్మారి విజృంభణకు కారణాలను కనుక్కోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కేన్సర్ బాధిత గ్రామాలైన గంగరేగువలస, సోమినాయుడు వలస గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కోల కిరణ్ కుమార్, పాలక రంజిత్ కుమార్, పార్వతీపురం మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు కేన్సర్ బాధితులను, మృతిచెందిన వారి కుటుంబాలను కలిసి పరామర్శించారు. కొంతమంది గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసిన పురుగుల మందు కంపెనీ సమీపంలో పొలం పనులకు వెళ్లిన వారికే అధికంగా కేన్సర్ సోకిందనే అనుమానం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ప్రభుత్వ పరంగా సేవలు అందడం లేదని బాధితులు వాపోయారు. బాధిత గ్రామాల్లో వైద్య శిబిరాలు తక్షణమే ఏర్పాటు చేసి, డోర్ టు డోర్ సర్వే చేయించి, కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని నాయకులు డిమాండ్‌చేశారు.

హెల్త్ సబ్‌సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సిబ్బందితో మాట్లాడుతున్న డిడిఎంహెచ్‌ఒ పద్మావతి

మండలంలో గొట్టివలసలోని ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె.వి.ఎస్.పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలన్నారు. వ్యాక్సినేషన్‌కి వచ్చిన బాలింతలతో మాట్లాడి, అందుతున్న సేవలపై ఆరాతీశారు. అబా ఐడి రూపొందించాలని సూచించారు. పైలెట్ ప్రోగ్రాం అయిన జననీ మిత్ర దరఖాస్తులను పరిశీలించారు. రక్తం తక్కువగా ఉన్న గర్భిణులకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పశుదాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రైతులు పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులకు రాయితీపై పశువుల దాణా పంపిణీని బుధవారం ప్రారంభించారు. పశువుల ఆరోగ్యం, ఉత్పత్తులు కాపాడడానికి పాడి రైతులకు సబ్సిడీపై నాణ్యమైన దాణా సరఫరా చేస్తున్నామని ఆమె తెలిపారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పాడి అభివృద్ధికి కృషి చేస్తూ ఆర్థికంగా బలోపేతం అవ్వాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి -వీరఘట్టం

పౌష్టికాహారం సక్రమంగా తీసుకోకపోతే వ్యాధులు సంక్రమిస్తాయని మెడికల్ సూపర్‌వైజర్ ఒ.శాంతకుమారి.. గర్భిణులు, బాలింతలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కూరాకుల వీధి అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడి కేంద్రాల్లో హైరిస్క్ గర్భిణులు, కిశోర బాలికలు ఎంతమంది ఉన్నారో వివరాలు అందజేయాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు జె.జ్ఞానమ్మ, రంగలక్ష్మి, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : గర్భిణులు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరరావు కోరారు. బుధవారం కురుపాం సచివాలయంలో ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు, పోషకాహారం అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా గర్భిణులకు హెచ్‌బి టెస్టు చేసి రక్తహీనత ఉన్నవారికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

సీతంపేట.. రక్తదానం చేస్తున్న విద్యార్థులు



పాచిపెంట.. రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు

విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులు బుధవారం స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేస్తే మరొకరు ప్రాణం నిలబెట్టిన వారు అవుతారని చెప్పారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. రక్తదానం పట్ల అపోహలు వద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు పి.అమృత, ఐటిఐ ప్రిన్సిపల్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయనగరంలోని ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రక్తాన్ని సేకరించారు. సికిల్ సెల్ ఎనీమియా, రక్త హీనత కలిగిన గర్భిణులకు ఈ రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని తహశీల్దార్ డి.రవి, గోపాలరావు తెలిపారు. ఈ శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కట్టా జాన్సీ పాల్గొన్నారు.

కస్పా వీధిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని కస్పా వీధిలో బుధవారం వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సాయికుమార్ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల వల్ల జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కాచిన నీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శు భారతమని, ఎంఎల్‌హెచ్‌పి కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని రెల్లివీధిలో బుధవారం ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా అమ్మకాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దొనకవీధికి చెందిన పోరాపు అరవింద్ నుంచి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆయనకు సారా సరఫరా చేసిన రెల్లివీధికి చెందిన రాయపల్లి ప్రవీణ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఆయనపైనా కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.